క్లుప్తంగా

అడ్డాకులలో వైద్యశిబిరం



అడ్డాకుల: మండల కేంద్రంలో ఆదివారం మాజీ ఎంపీపీ ఎల్లగౌడ్ కుమారుడు డాక్టర్ జీవీకేఆర్ గౌడ్ ఏర్పాటుచేసిన ఉచిత వైద్యశిబిరం విజయవంతమైంది. జీవీకేఆర్ న్యూరో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి మహబూబ్‌నగర్ ఆధ్వర్యంలో రోగులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి డాక్టర్ జీవీకేఆర్ గౌడ్ ఉచితంగా మందులను పంపిణీ చేశారు. జెడ్పీటీసీ మాజీ సభ్యుడు రాజశేఖర్‌రెడ్డి వైద్యశిబిరాన్ని సందర్శించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఎల్లగౌడ్, చంద్రమోహన్‌రెడ్డి, రమేష్, శ్రీనివాస్, మహేష్‌యాదవ్, జహంగీర్ తదితరులున్నారు.

సంతలో అన్నదానం



నవాబుపేట: మండల కేంద్రానికి చెందిన మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నర్సింహచారి సంతకు వచ్చే జనాల కోసం ప్రతి ఆదివారం అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. దాదాపు 500 మందికి తగ్గకుండా మధ్యాహ్న భోజనం చేస్తున్నారు. కాగా ఇరవై ఐదు వారాలుగా ఈ కార్యక్రమం నిరాటంకంగా సాగిస్తుండటంపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వ్యాపార సంఘం మండలాధ్యక్షుడు సుధాకర్‌చారి, పుట్టి అంజనేయులు, రఘువీర్‌శర్మ, నిరంజన్, లక్ష్మీనర్సింహచారి, గీతారాణి, విశ్వనేత్ర, చందు, వెంకటయ్య పాల్గొన్నారు.

అ'పూర్వ' సమ్మేళనం



అడ్డాకుల: మూసాపేట మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1994–95లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం తుంకినీపూర్ శివారులోని ఓ వ్యవసాయ క్షేత్రంలో సమ్మేళనాన్ని నిర్వహించారు. నాడు పాఠశాలలో చదువుకునే రోజుల్లో గడిపిన మధుర క్షణాలను గుర్తుచేసుకున్నారు. కుటుంబ యోగక్షేమాలను తెలుసుకొని జ్ఞాపకాలను నెమరేసుకున్నారు. పూర్వవిద్యార్థులు కొండయ్య, రమేష్, కృష్ణ, జగన్, చెన్నారెడ్డి, మొక్తదీర్ బాబా, బాలరాజు, బాలస్వామి, షబ్బీర్, మొయిన్, రాము పాల్గొన్నారు.

26 ఏళ్ల తరువాత..

దేవరకద్ర: స్థానిక జెడ్పీహెచ్‌ఎస్‌లో 1998–99 ఎస్‌ఎస్‌సీ చదివిన పూర్వవిద్యార్థులు 26 ఏళ్ల తరువాత కలుసుకున్నారు. స్థానిక పాఠశాల ఆవరణలో జరిగిన ఈ కార్యక్రమం ఆహ్లాదకర వాతావరణంలో కొనసాగింది. చాల ఏళ్ల తరువాత కలుసుకున్న స్నేహితులు ఒకరిని ఒకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. పదో తరగతిలో చేసిన అల్లరి పనులను నెమరేసుకొన్నారు. 1వ తర గతి నుంచి 10వ తరగతి వరకు పాఠాలు చెప్పి న ఉపాధ్యాయులందరిని ఈవేదికకు ఆహ్వానించి వారందరిని ఘనంగా సన్మానించారు. కొండ ప్రశాంత్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, తిప్పారెడ్డి, భాస్కర్, రాజశేఖర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, రాంరెడ్డి, దమయంతి పాల్గొన్నారు.

రేపు కోడెదూడల వేలం

మహబూబ్‌నగర్ రూరల్: మన్యంకొండ శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి వారికి భక్తులు సమర్పించిన మొక్కుబడి కోడెదూడలను మంగళవారం బహిరంగ వేలం వేయనున్నట్లు ఆలయ చైర్మన్ అళహరి మధుసూదన్‌కుమార్, ఈఓ శ్రీనివాసరాజు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కొండదిగువన గల శ్రీఅలివేలుమంగతాయారు అమ్మవారి ఆలయం వద్ద ఉదయం 11గంటలకు వేలం నిర్వహిస్తారని, ఈవేలంలో రైతులు మాత్రమే పాల్గొనాలని ఆయన కోరారు.

నేడు శివపార్వతుల కల్యాణం

కోస్గి: పట్టణంలోని తిమ్మనబావి శివాంజనేయ స్వామి ఆలయంలో సోమవారం శివపార్వతుల కల్యాణం నిర్వహిస్తున్నట్లు శివ మాలధారులు తెలిపారు. ప్రతియేటా మూడు రోజుల పాటు నిర్వహించే శివరాత్రి వేడుకల్లో భాగంగా ఈ కల్యాణోత్సవం నిర్వహిస్తున్నామన్నారు. ఈ వేడుకల్లో భాగంగా సోమవారం ఉదయం 7:05 గంటలకు నంది సహిత గోమాత పూజ, 8:05గంటలకు వీరభద్రస్వామి ఆల యం నుంచి శివపార్వతుల విగ్రహాల ఊరేగింపు, 9 గంటలకు గణపతి, గౌరీ పూజ, పుణ్యాహవాచనం, ఉత్సవ విగ్రహాలకు అభిషేకం, కల్యాణం ఉంటుందని, భక్తులు పాల్గొనాలని కోరారు.







నిర్లక్ష్యానికి నిదర్శనం

గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన ఓపెన్ జిమ్ నిర్వహణను గాలికొదిలేశారు. వివిధ రకాల ఎక్సర్‌సైజ్ చేసే యంత్రాలు విరిగిపోయి తుప్పుపట్టాయి. మండల కేంద్రంలో చిన్నారులు, యువకులతో వృద్ధులకు ఈ ఓపెన్ జిమ్ ఎంతో సౌకర్యవంతంగా ఉండేది. ప్రస్తుత ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. రూ.25లక్షల ప్రజాధనంతో నిర్మించిన ఈ జిమ్‌పై అధికారులు దృష్టి సారించి సౌకర్యాలను మెరుగుపర్చాలని స్థానికులు కోరుతున్నారు.

– హన్వాడ

భక్తిశ్రద్ధలతో కాలభైరవస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన

స్టేషన్ మహబూబ్‌నగర్: న్యూమోతీనగర్‌లోని శ్రీఅన్నపూర్ణా సమేత కాశీ విశ్వనాథేశ్వరస్వామి దేవాలయం ప్రథమ వార్షికోత్సవం, శ్రీకాలభైరవ స్వామి విగ్రహ ప్రతిష్ఠానోత్సవాలు ఆదివారం భక్తిశ్రద్ధలతో జరిగాయి. మండప దేవతపూజలు, పీఠ పూజ, నవరత్నవ్యాసం, చండీహోమం, యంత్రస్థాపన, అష్టబంధనం, మహాపూర్ణాహుతి, మహాసంప్రోక్షణ పూజలు చేశారు. కాశీనుంచి తీసుకొచ్చిన కాలభైరవ విగ్రహానికి భక్తులు దేవాలయం వరకు ఊరేగింపు నిర్వహించారు. అనంతరం దేవాలయంలో ప్రతిష్ఠించారు. శ్రవణ్‌కుమార్‌శర్మ ధార్మిక ప్రవచనం చేశారు. వార్షికోత్సవ, ప్రతిష్ఠాపన వేడుకల్లో మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ పాల్గొని దేవతామూర్తులకు పూజలు చేశారు. ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, ఆలయ ధర్మకర్త చైర్మన్ ఎస్.ప్రభాకర్, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు రాములుయాదవ్, యాదగిరి, రవికుమార్, నాగేష్, నరేష్, వీరేష్ తదితరులు పాల్గొన్నారు.



ఊరేగింపులో పాల్గొన్న భక్తులు



పూజల్లో పాల్గొన్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

మైసమ్మ ఆలయానికి పోటెత్తిన భక్తులు



పర్వతాపూర్ మైసమ్మ ఆలయం వద్ద భక్తులు



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

నవాబుపేట: మండలంలోని పర్వతాపూర్ మైసమ్మ దేవాలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేసి నైవేద్యాలు సమర్పించారు. దేవాలయానికి అధిక సంఖ్యలో భక్తులు రావడంతో అడవి ప్రాంతం జన జాతరగా మారింది. అమ్మవారి నామస్మరణతో ఆ ప్రాంతం మార్మోగిపోయింది. ప్రత్యేక అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు.

పాఠశాలకు కొత్త శోభ

శత వసంతోత్సవానికి బాదేపల్లి జెడ్పీహెచ్‌ఎస్ ముస్తాబు



పెయింటింగ్‌తో కొత్త శోభ సంతరించుకున్న స్కూల్ భవనం

జడ్చర్ల టౌన్: మరికొద్ది నెలల్లో శత వసంతంలోకి అడుగుపెట్టనున్న బాదేపల్లి బాలుర జెడ్పీహెచ్‌ఎస్ భవనానికి పెయింటింగ్‌తో కొత్త కళ సంతరించుకొంది. అమ్మ ఆదర్శ పాఠశాలలలో భాగంగా వారం రోజులక్రితం హైస్కూల్ భవనాలకు పెయింటింగ్ పనులు ప్రారంభించారు. హైస్కూల్‌లో మొత్తం మూడు బ్లాక్‌లు ఉన్నాయి. రెండు బ్లాక్‌ల్లో పెయింటింగ్ పనులు పూర్తయి మూడోబ్లాక్ వద్ద పనులు కొనసాగుతున్నాయి. హైస్కూల్ 99ఏళ్ల పూర్తిచేసుకొని ఈఏడాది జూన్‌లో 100వ వసంతంలోకి అడుగుపెడుతున్న తరుణంలో పెయింటింగ్ వేయటం పట్ల పూర్వ, ప్రస్తుత విద్యార్థులు, టీచర్లు హర్షం వ్యక్తంచేస్తున్నారు. బాదేపల్లి హైస్కూల్‌తోపాటు మండలంలోని గంగాపురం, పెద్దఆదిరాల జెడ్పిహైస్కూల్‌లోనూ పెయింటింగ్ పనులు ప్రారంభం కానున్నాయి.

సంత్ గాడ్గేబాబాకు ఘన నివాళి



మహబూబ్‌నగర్‌లోని జైభీమ్ చౌరస్తాలో గాడ్గే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు



జడ్చర్లలో గాడ్గే చిత్రపటానికి నాయకుల నివాళి

జడ్చర్ల: సంఘ సంస్కర్త సంత్ గాడ్గే బాబా జయంతిని ఆదివారం జడ్చర్లలో బీసీ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీసీ జాగృతి సేన అధ్యక్షుడు కృష్ణయాదవ్, జహంగీర్, నర్సిములు, శేఖర్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శంగా నిలిచారు..

మహబూబ్‌నగర్ రూరల్: బహుజన మహనీయుడు సంత్ గాడ్గే బాబా 149వ జయంతిని పురస్కరించుకొని పాతూరులోని జైభీమ్ చౌరస్తాలో ఆయన చిత్రపటానికి దళిత, బహుజన నాయకులు ఆదివారం ఘనంగా నివాళులర్పించారు. మహాత్మాగాంధీకి సంత్ గాడ్గేబాబా ఆదర్శంగా నిలిచారన్నారు. 150కిపైగా విద్యాలయాలు స్థాపించి ప్రజలను అక్షరాస్యులుగా తీర్చిదిద్దారని, ఆయన జీవిత చరిత్రను పాఠ్యాంశంగా చేర్చి రేపటి పౌరులకు, ప్రజలకు తెలిసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వారు కోరారు. దళిత బహుజన నాయకులు సింగిరెడ్డి పరమేశ్వర్, వెంకట్రాములు, చెన్నయ్య పాల్గొన్నారు.

డిజిటల్ సర్వే సమస్యలు పరిష్కరించాలి

మరికల్: డిజిటల్ సర్వే ద్వారా పంటల నమోదులో వ్యవసాయ విస్తరణ అధికారులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆదివారం జిల్లా వ్యవసాయ అధికారి జాన్ సుధాకార్‌కు వినతిపత్రం ఇచ్చారు. క్షేత్రస్థాయిలో సర్వే చేసే విషయంలో అనేక ఇబ్బందులు తలెత్తున్నాయని జాన్ సుధాకర్‌కు వివరించారు. తమ సెల్‌ఫోన్లలో సర్వే వివరాలను నమోదు చేయడం సమస్యలు వస్తున్నాయని, వ్యవసాయ శాఖ పరంగా నూతన మొబైల్ ఫోన్లు ఇప్పించాలని కోరారు.

పరీక్షా కేంద్రం పరిశీలన

భూత్పూర్: రాష్ట్ర గురుకులాల్లో 5వ తరగతిలో ప్రవేశానికి ఆదివారం నిర్వహించిన ప్రవేశ పరీక్షను అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్ పరిశీలించారు. మున్సిపాలిటీలోని అమిస్తాపూర్ సమీపంలోని రాజీవ్ స్వగృహలో ఉన్న మహాత్మాజ్యోతిరావుపూలే బాలికల రెసిడెన్షియల్ పాఠశాలల్లో ఉమ్మడి జిల్లాకు చెందిన 191మంది విద్యార్థులకు గాను 186 మంది విద్యార్థులు హాజరైనట్లు ప్రిన్సిపాల్ కె.వి.సుగుణశ్రీ తెలిపారు. విద్యార్థులు పరీక్ష రాస్తున్న తీరును పరిశీలించారు. ఆర్సీఓ వెంకట్‌రెడ్డి, తహసీల్దార్ జయలక్ష్మి, ఆర్‌ఐలు వెంకటేష్, బాలసుబ్రమణ్యం తదితరులు ఉన్నారు.

ఇసుక డంప్‌లు సీజ్



దేవరకద్ర రూరల్: అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుక డంప్‌లను రెవెన్యూ అధికారులు సీజ్ చేశారు. గురకొండ గ్రామంలో ఎలాంటి అనుమతుల్లేకుండా ఇసుక డంపులను నిల్వ ఉంచారు. ఆదివారం సమాచారం అందడంతో ఆర్‌ఐ శరత్ గ్రామానికి చేరుకొని నిల్వఉంచిన 25 ట్రాక్టర్లకు సంబంధించిన ఇసుక డంపులను తహసీల్దార్ కృష్ణయ్య ఆదేశాల మేరకు సీజ్‌చేశారు. రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

మిడ్జిల్: మండలంలోని వాడ్యాల్‌లో సోమవారం ఉదయం పంచాయతీ కార్యాలయం వద్ద 'ఆశయం హ్యాండ్ ఆఫ్ హోప్' ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు జాన్‌పాల్, పరిమళరాజ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈశిబిరాన్ని చుట్టుపక్కల గ్రామాలప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

సేవాదళ్‌ది ఘన చరిత్ర



స్టేషన్ మహబూబ్‌నగర్: కాంగ్రెస్ పార్టీలో సేవాదళ్‌కు ఘనమైన చరిత్ర ఉందని ఆ సంస్థ జిల్లా ఇన్‌చార్జి వాజిద్ మహెక్ అన్నారు. జిల్లా కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షుడు రాజేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో చివరి ఆదివారం సందర్భంగా స్థానిక పార్టీ కార్యాలయంలో జెండాను ఎగురవేశారు. వాజిద్ మాట్లాడుతూ కాంగ్రెస్‌లో సేవాదళ్‌కు ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు జిల్లా సేవాదళ్ అధ్యక్షులు రాజేశ్వర్‌రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అన్వర్‌పాష మాట్లాడుతూ రాబోయే రోజుల్లో ప్రతివాడలో జెండా ఆవిష్కరిస్తామన్నారు. సీజే బెనహర్, సుభాష్ ఖత్రి, అలీ, లోక్‌నాథ్, సంజీవరెడ్డి, జగదీష్, వెంకటలక్ష్మి, ఉమర్, నవీన్ పాల్గొన్నారు.

గ్రామీణాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి
- సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం



కాకర్‌జాల్‌లో సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

నవాబుపేట: గ్రామీణాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని కాకర్‌జాల్ గ్రామంలో రూ.20లక్షలతో సీసీ రోడ్డు పనులు ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మండలానికి దాదాపుగా రూ.2 కోట్ల వరకు సీసీ రోడ్లు మంజూరు చేయించి పనులు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. మారుమూల గ్రామాల్లో అంతర్గతంగా రోడ్లు సరిగ్గా లేకపోవటంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారన్నారు. కాగా గతంలో సర్పంచ్‌లకు గత ప్రభు త్వం నిధుల లేమితో ఇబ్బందులు గురిచేసిందని అందుకే తాము వచ్చిన ఏడాదిలోనే గ్రామాలపై దృష్టిపెట్టి సీసీ రోడ్లు, డ్రెయినేజీల అభివృద్ధికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. మండలానికి అతిచేరువలో ఉన్న జాతీయ రహదారికి గల రోడ్లు డబుల్‌రోడ్డుతో పాటు మరింత అభివృద్ధి చేసేలా ప్రణాళికలు వేసినట్లు ఆయన వివరించారు. కార్యక్రమంలో మార్కెట్ వైస్ చైర్మన్ తులసీరాంనాయక్, వాసుయాదవ్, ఓమర్, రమేష్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలి



మాట్లాడుతున్న ఎరుకల సంఘం జిల్లా అధ్యక్షుడు నర్సింహులు

మహబూబ్‌నగర్ రూరల్: పట్టణంలోని ఏకలవ్య కాలనీలో అర్హులైన వారందరికీ ఇందిరమ్మ పథకంలో ఇళ్లు మంజూరు చేయాలని ఏకలవ్య ఎరుకల సంఘం జిల్లా అధ్యక్షుడు రాగిరి నర్సింహులు కోరారు. ఆదివారం కాలనీలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గతంలో ఏకలవ్య కాలనీలో అర్హులైన ఎరుకల కులస్తులకు అప్పటి దివంగత ఎంపీ విఠల్‌రావు, దివంగత ఎమ్మెల్యే రాజేశ్వర్‌రెడ్డి హయాంలో ఇళ్ల స్థలాలు కేటాయించినట్లు తెలిపారు. అప్పట్లో కొంతమంది ఇందిరమ్మ పథకంలో ఇళ్లు నిర్మించుకోగా.. మరికొందరు ఆస్థలాలను ఇతరులకు అమ్ముకున్నారన్నారు. ఇప్పుడు స్థలాలు అమ్ముకున్న వారే కాలనీలో దౌర్జన్యాలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇళ్ల స్థలాల కేటాయింపుపై పూర్తిస్థాయిలో విచారణ జరిపించాలని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డిని కోరారు.

వైభవంగా మల్లెలమ్మ బోనాలు



బోనాల్లో పాల్గొన్న మున్సిపల్ చైర్‌పర్సన్ పుష్పలత తదితరులు

జడ్చర్ల: స్థానిక 5వ వార్డులో ఆదివారం మేదరి సంఘం ఆధ్వర్యంలో మల్లెలమ్మ బోనాలను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లెలమ్మ అమ్మవారికి బోనాలను సమర్పించి మొక్కులను తీర్చుకున్నారు. మున్సిపల్ చైర్ పర్సన్ పుష్పలత, వైస్ చైర్ పర్సన్ సారిక, కౌన్సిలర్లు నవనీత, జ్యోతి, నాయకులు రామ్మోహన్, కొండల్ పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

శ్రీమల్లీశ్వరిదేవి ఆలయంలో..



బోనాల్లో పాల్గొన్న మున్సిపల్ మాజీ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్ తదితరులు

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రంలోని వీరన్నపేటలో ఆదివారం శ్రీమల్లీశ్వరిదేవి ఆలయం బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ సైతం హాజరై పూజలు నిర్వహించారు. అదే విధంగా అమ్మవారి బోనాల ఊరేగింపులో మున్సిపల్ మాజీ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

దేవాలయాలకు రూ. 2.51 లక్షల విరాళం



దేవాలయానికి విరాళం ఇస్తున్న దాతలు

దేవరకద్ర: మండల కేంద్రంలో ప్రసిద్ధి చెందిన ఈశ్వర వీరప్పయ్యస్వామి దేవాలయాలు, శిఖరాల పునర్నిర్మాణ పనుల కోసం దేవరకద్రకు చెందిన దివంగత కల్వ శ్రీనివాసులు, కల్వ ఈశ్వరమ్మల జ్ఞాపకార్థం వారి కుమారులు రూ. 2.51 లక్షలను దేవస్థాన కమిటీకి ఆదివారం అందజేశారు. కల్వ కన్నయ్య, కమలమ్మ, కల్వ నరేష్‌కుమార్, నాగవేణి, కల్వ ఈశ్వర్, సరిత, కల్వ రఘురాం, వనిత దంపతులు ఈ విరాళం దేవస్థానానికి అందజేశారు. లక్ష్మీపల్లి మణెమ్మ కుమారులు నరసింహారెడ్డి, అనిత, అయ్యపురెడ్డి, లక్ష్మీదేవి, రాఘవేందర్‌రెడ్డి, జయశ్రీ రూ. 11.116ను అందజేశారు.

'వాల్టా'కు తూట్లు

- ఇష్టానుసారంగా చెట్ల నరికివేత
- పట్టించుకోని అధికారులు



కొల్లూర్ సమీపంలో నరికివేసిన చెట్టు

నవాబుపేట: మండలంలో వాల్టా చట్టానికి తూట్లు పొడుస్తున్నారు. ఇష్టానుసారంగా చెట్లను నరికివేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ఎలాంటి అనుమతుల్లేకుండా పెద్దపెద్ద చెట్లు నరికివేతకు గురౌతున్నాయి. మండంలోని కామారం, కొల్లూర్, పోమాల్, గురుకుంట, రేకులచౌడాపూర్, కిషన్‌గూడ ప్రాంతాల్లో ఎక్కువగా చెట్ల నరికివేత కొనసాగుతోంది. నరికివేసిన చెట్లను పట్టపగలు లారీలు, ట్రాక్టర్లలో తరలిస్తున్నారు. అధికారులు స్పందించి వెంటనే అక్రమ చెట్ల నరికివేతకు చెక్ పెట్టాల్సి ఉంది. కలప తరలింపుపై నిఘా పెట్టాల్సిన అవసరం ఉంది. కాగా ఈ విషయంలో ఇప్పటికే గురుకుంట, కొల్లూర్ గ్రామాల యువజన సంఘాల సభ్యులు అధికారులకు పిర్యాదు చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.



తరలించేందుకు సిద్ధంగా ఉంచిన కలప

26 నుంచి బైరంకొండ ఉత్సవాలు

నారాయణపేట రూరల్: మండలంలోని బైరంకొండ గ్రామ అమ్మవారి తోట శివాలయంలో ఈనెల 26 నుంచి రెండు రోజులపాటు జాతర నిర్వహిస్తున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు. బుధవారం ఉదయం స్వామివారికి రుద్రాభిషేకం, బిల్వార్చన, మహా మంగళహారతి నిర్వహిస్తారు. 26న ఉదయం 10గంటలకు శివపార్వతుల కల్యాణం, మ ధ్యాహ్నం మూడుగంటలకు ఊరేగింపు, సాయంత్రం ఐదు గంటలకు రథోత్సవం, రాత్రికి భజన కార్యక్రమం ఉంటాయన్నారు. అదేవిధంగా 27న అభిషేకం, మహా నైవేద్యం, భక్తులకు అన్నదానం కార్యక్రమం చేపడతారు. ఉదయం 10 గంటల నుంచి రిటపట్ల కార్యక్రమం ఉంటుందన్నారు. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని గ్రామంలోని చిన్నారులకు దైవభక్తి పాటలపై నిత్య పోటీలు నిర్వహిస్తున్నారు.